

బస్సు డిపో పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, ఆర్టీసీ అధికారులు

### ఏటూరునాగారం బస్‌డిపో
# పనులకు శంకుస్థాపన

**మేడారం జాతరకు డిపో ప్రారంభం.. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

ఏటూరునాగారం, జూన్ 12 : ఏటూరునాగారంలో బస్‌డిపో నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటూరునాగారంలో బస్‌డిపో పనులకు కోసం రూ. 7 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ. 5 కోట్లతో ములుగు బస్టాండు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. మంగపేట, గట్టమ్మ వద్ద కూడా బస్టాండు నిర్మించనున్నట్లు చెప్పారు. వచ్చే మేడారం జాతర నాటికి బస్ డిపో పనులు పూర్తి చేసి రవాణా శాఖ మంత్రిచే ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు, ఏపీ వరకు బస్సులు నడిపించే అవకాశం ఉందన్నారు. గిరిజన భవన్‌లో లబ్ధిదారులకు మంత్రి ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు కాగా, మరో 1500 ఇండ్లు కూడా ఐటీడీఏ పరిధిలో కావాలని కోరడంతో అదనంగా మంజూరు చేశామన్నారు. అనర్హులకు వస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఏటూరునాగారాన్ని మున్సిపాలిటీ చేయాలని కొందరు కోరుతున్నారని, ప్రజలు తీర్మానం చేస్తే మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అయితే వంద రోజుల పనిని నిలిపివేస్తారని, ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఏటూరునాగారంలో కూరగాయాల మార్కెట్ కోసం రూ.కోటి మంజూరు చేశామన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.ఇక్కడ టెన్త్ బ్యాచ్ వారు వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు సౌకర్యాలు మెరుగు పర్చాలని కోరడంతో రూ. 15లక్షలు మరమ్మతులు, వసతి సౌకర్యాల కోసం మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, డీఆర్‌డీవో సంపత్‌రావు, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎం కిరణ్, డిపో మేనజర్ అర్పిత, చీఫ్ ఇంజినీర్ భాస్కర్, స్థానిక కంట్రోలర్ శ్రీనివాస్, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, మండల ప్రత్యేకాధికారి రాంపతి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**పూజారుల అతిథి గృహం ప్రారంభం**

తాడ్వాయి : మేడారంలో రూ.98లక్షలతో నిర్మించిన సమ్మక్క, సారలమ్మల పూజారుల అతిథి గృహాన్ని గురువారం మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహాజాతరతోపాటు మిగతా సమయాల్లో పూజారులకు ఇబ్బందులు కలుగకుండా అతిథి గృహం నిర్మించామని తెలిపారు. అనంతరం మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడారం ఈవో వీరాస్వామి, ఓఎస్డీ రవీందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, పూజారులు పాల్గొన్నారు.

## నిరుపేద ఎస్సీ మహిళలకు మూడెకరాల భూమి

**భూపాలపల్లి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్**

రేగొండ, జూన్ 12 : భూమిలేని ఎస్సీ నిరుపేద మహిళలకు భూమి కొనుగోలు పథకం కింద మూడెకరాల భూమి అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో గోరికొత్తపల్లి మండలం జగ్గయ్యపేటలో ఆయన వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పట్టాదారులుగా వారి పేర రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు చెప్పారు. అలాగే సాగు చేసుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పథకం అమలు పారదర్శకంగా ఉంటుందని, గ్రామ సభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశర్లు, తహసీల్దార్ ఉన్నారు.

## రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించాలి

కాటారం, జూన్ 12 : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అన్నారు. మండలకేంద్రంతో పాటు జాదురావుపేట గ్రామాల్లో రైతుల నుంచి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. కాటారంలో 397, జాదురావుపేటలో 146 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. కాటారంలో రెవెన్యూ సదస్సును సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేసి రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకన్న, భూ భారతి మండల కో-ఆర్డినేటర్ కొట్టె శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

పాత ఫర్నీచర్ కావలెను
★స్కూల్‌కు సంబంధించిన పాత ఫర్నీచర్ కావలెను. వెంటనే సంప్ర: శ్రీ భువనేశ్వరీ అప్పర్ ప్రైమరీ స్కూల్, సెల్: 8465877022.
NTW-337020

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED HOSPITAL STAFF
jobs Apply Now!
★PHARMACY BOYS (Experienced)
★LAB TECHNICIANS (Experienced)
★COMPUTER OPERATORS & SUPERVISORS
Guardian Hospital, Mulugu 'X' Road, WGL. 12 to 2 PM.
NTW-522

LOSS OF PASSPORT
★I, MOHAMMED MANZOOR SHAREEF S/o. MOHAMMED HUSSAIN SHAREEF R/o H.No. 2-6-1109, Near Masjide Shariefain, KLN Reddy Colony, Subedari, Hanamkonda Town & Dist-506001. I Lost my Original Passport bearing No. H0384920 issued at Hyderabad. While travelling by bike to Xerox Center, Subedari. If anybody found Please inform to me cell: 9849202825.
NTW-6706

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565



గణపురం : విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు సోమిరెడ్డి



చిట్యాల : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈవో రాజేందర్



మొగుళ్లపల్లి : మొట్లపల్లి పాఠశాలలో పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు



భూపాలపల్లి రూరల్: విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎంఈవో దేవానాయక్

# పండుగలా పాఠశాలల పునఃప్రారంభం

- మామిడి తోరణాలు, బెలూన్లతో స్కూళ్ల ముస్తాబు
- విద్యార్థులకు స్వాగతం పలికిన విద్యాధికారులు
- పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ

చిట్యాల/ భూపాలపల్లి రూరల్/ మహదేవపూర్/ గణపురం/ మొగుళ్లపల్లి/ వాజేడు/ మంగపేట, జూన్ 12 : నూతన విద్యా సంవత్సరం గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మామిడి తోరణాలు, పువ్వులు కట్టి ముస్తాబు చేశారు. స్కూళ్ల ముందు ముగ్గులు వేసి తీర్చిదిద్దారు. బెలూన్లతో అందంగా మార్చారు. విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు పంచగా కొన్ని పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు పూలతో ఆహ్వానం పలికారు. కొన్ని పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందించారు. చిట్యాల మండలం



వాజేడు హైస్కూల్ వద్ద ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

నైన్‌పాక జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం ఊర్మిళాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో రాజేందర్ హాజరయ్యారు. ఎంఈవో రఘుపతి, సీఎంవో రమేశ్, సెక్టోరియల్ ఆఫీసర్ రాజగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భూపాలపల్లి మండలం కొంపెల్లి పాఠశాలలో ప్రిన్సిపాల్ బీ విజయ ఆధ్వర్యంలో పాఠశాల పునః ప్రారంభంమైన సందర్భంగా వెల్ కం బ్యాక్ టు స్కూల్ కార్యక్రమం నిర్వహించారు. మహదేవపూర్ మండలకేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ వై రామారావు, కాంప్లెక్స్ హెచ్ఎం బండం రాజిరెడ్డి, బాలికల పాఠశాల హెచ్ఎం సరిత పాల్గొన్నారు. గణపురం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర పరిశీలకుడు సోమిరెడ్డి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందించారు. భూపాలపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, హెచ్ఎం దేసు సతీశ్‌కుమార్ పాల్గొన్నారు. మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి పాఠశాలలో హెచ్ఎం మహేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు. వాజేడు ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం సోయం ఆనందరావు ఆధ్వర్యంలో మామిడి తోరణాలు కట్టి వినూత్నంగా స్వాగతించారు. మంగపేట మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో పొడెం మేనక విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం బానోత్ బాలాజీ, వెంకటస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మేడిగడ్డ బరాజ్ వద్ద సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం

## మేడిగడ్డను సందర్శించిన శిక్షణ అధికారులు

మహదేవపూర్, జూన్ 12 : మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంప్ హౌస్‌లను గురువారం 2024 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం సందర్శించింది. మేడిగడ్డ బరాజ్, పంపు హౌస్‌ల ప్రాముఖ్యత, సాంకేతిక విషయాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకముందు వారు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్ష చేయడం చట్టరీత్యా నేరం

భూపాలపల్లి రూరల్, జూన్ 12 : లింగ నిర్ధారణ పరీక్ష చేయడం చట్టరీత్యా నేరమని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 14 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ఇందులో ఐదు ప్రభుత్వ ఆధీనంలో, తొమ్మిది ప్రైవేట్ సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల నిరోధంపై దృష్టి పెట్టాలన్నారు. అలా చేసినా, ప్రోత్సహించినా మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తారని తెలిపారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 9440586982కు లేదా 6303239891కు వాట్సాప్ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, గైనకాలజిస్టు డాక్టర్ కవిత, పిడియాట్రిషన్ డాక్టర్ సురేందర్, డెమో శ్రీదేవి, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.

## మెడిసిన్ స్టోర్ పరిశీలన

ములుగురూరల్, జూన్ 12 : ములుగు జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ఉన్న జిల్లా సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు గురువారం తనిఖీ చేశారు. వర్షకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు కావలసిన మందులను మూడు నెలలపాటు స్టోర్‌లో ఉంచుకోవాలని ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాస్‌కు సూచించారు. అనంతరం సర్జికల్ పరికాలను, కుక్క కాటు, పాము కాటు వ్యాక్సిన్‌ల నిల్వల గదులను, ఇతర గదులను పరిశీలించి అన్ని రిజిస్టర్లను సరి చేశారు. కార్యక్రమంలో డెమో సంపత్, వినోద్, హిమ కిరణ్ ఉన్నారు.

## కాటారం డీఎస్పీగా సూర్యనారాయణ



కాటారం, జూన్ 12 : కాటారం సబ్ డివిజన్ పోలీస్ అధికారి (డీఎస్పీ)గా సూర్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పని చేసిన రామ్మోహన్‌రెడ్డిని పోలీస్ చీఫ్ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. భూపాలపల్లి పనిచేస్తున్న డీఎస్పీ సూర్యనారాయణకు కాటారం కేటాయించారు. కాగా, బదిలీలు జరిగి 20 రోజులు అవుతుండగా చేర్పులు, మార్పులతో కాటారం డీఎస్పీగా ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న సూర్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీని కాటారం సీఐ నాగార్జున రావు, కాటారం ఎస్సైలు అభినవ్, శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలందించి స్వాగతం పలికారు.

## ఎంపీవోకు తాళాల అప్పగింత

మహదేవపూర్, జూన్ 12 : గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ఆర్థిక భారం భరించలేమంటూ మండలంలోని జీపీ కార్యదర్శులు గురువారం ట్రాక్టర్లకు తాళాలు వేసి ఎంపీవో ప్రసాద్‌కు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో ట్రాక్టర్ డీజిల్ నిర్వహణతో పాటు ఇతర ఖర్చులకు అప్పులు చేశామని, ఇక తమ వల్ల కాదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక మనోవేదనకు గురవుతున్నామన్నారు. కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, అంజలి, కల్పన, రమేశ్, సతీశ్, సృజన్, గాయత్రి, కుమార్, సమ్మయ్య, మంసూర్ తదితరులు పాల్గొన్నారు.

### మూతపడిన పాఠశాలను
## సందర్శించిన అధికారులు

వాజేడు, జూన్ 12 : విద్యార్థులు లేక గత నాలుగేళ్లుగా మూతపడిన మండలంలోని పాయబట్ల ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను బడికి పంపించి పాఠశాల ప్రారంభానికి సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. బడిలో చేరిన ఇద్దరు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో తేజావత్ వెంకటేశ్వరరావు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు అర్రం రాజు, గుల్లపెల్లి సాంబయ్య పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

గోవిందరావుపేట, జూన్ 12 : కేంద్ర, రాష్ట్ర రైతు వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పోతునేని సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని సోమలగడ్డ క్రాస్ వద్ద ఉన్న పీఎస్ఆర్ గార్డెన్‌లో సీపీఎం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పస్రా నుంచి ఫంక్షన్ హాల్ వరకు రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు చిట్టం ఆదినారాయణ అధ్యక్షతన వహించగా సుదర్శన్‌రావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మహాసభలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా నాయకుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు కపూర్, ఆదిరెడ్డి, చిట్టిబాబు, మల్లారెడ్డి, లెనిన్, నాగేశ్వర్‌రావుతోపాటు వందలాది రైతులు, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్, జూన్ 12 : అధిక ఫీజులు వసూలు చేస్తూ, ప్రభుత్వ నిబంధనలు పాటించని జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఈవో రాజేందర్‌కు గురువారం జాతీయ మానవ హక్కుల మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ కుమారస్వామి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల్లోనే బుక్స్, స్టేషనరీ అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులకు ఆర్థిక భారం మోపుతున్నారన్నారు. నిరుపేద కుటుంబాల్లోని 30 మందికి ఫ్రీగా చదువు చెప్పాలనే నిబంధన ఉన్నా ఎవరూ పాటిచడంలేదని ఆరోపించారు. డీఈవో సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అన్ని పాఠశాలల యాజమాన్యాలను పిలిచి మాట్లాడుతానని, అధిక ఫీజులు తీసుకోకుండా కట్టడి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సభవతు నాగరాజు హన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ కుమారస్వామి, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జనరల్ సెక్రటరీ వేశాల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# అన్నదానం అభినందనీయం

వెంకటాపురం(నూగూరు), జూన్ 12 : పేదలకు, భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని సీఐ బండారి కుమార్ అన్నారు. ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సాయిబాబా మందిరం వద్ద ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమాన్ని దాతలు చేపట్టి సంవత్సరం అయిన సందర్భంగా ఆయన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు, సీపీఐ సీనియర్ నాయకులు తోట మల్లిఖార్జున్ రావు, ఆలయ కమిటీ సభ్యులు ధనపనేని వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, శివాజీయాదవ్, శాంత మూర్తి, నెహ్రూ, శ్రీనివాస్, నర్సింహరావు, నర్సింహచారి, శ్యామ్, పూర్ణచందర్‌రావు, నేతాజీ, రాంబాబు, నాగరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు

భూపాలపల్లి రూరల్, జూన్ 12: చిన్న పిల్లలు ఉండాల్సింది బడిలో కానీ, పనిలో కాదని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాజు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఆర్ దిలీప్ కుమార్‌నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జీ అఖిల, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ రావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే అక్షయ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణపై ఆటో డ్రైవర్ వినూత్న ప్రచారం



చుట్టూ మొక్కలు ఆటోకి కట్టుకొని యాత్రచేస్తున్న ఆటో అంజి(భూక్యా)

వాజేడు, జూన్ 12 : మొక్కలు పెంచడం వలన కలిగే ప్రయోజనాలు, వాటి వల్ల మానవాళికి ఉపయోగం ఎలా ఉంటుందో వివరిస్తూ మహబూబాద్ జిల్లా ఈదులపుసపల్లి దర్గతండాకు చెందిన భూక్యా అంజి ఆటోకు మొక్కలు కట్టుకొని అంతరాష్ట్ర ఆటో యాత్ర చేపట్టాడు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం వాజేడు మండలం మీ దుగా ఏటూరునాగారం వైపు వెళ్తుండగా 'నమస్తే తెలంగాణ' అంజిని పలకరించింది. ఇప్పటి వరకు మహబూబాద్, ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వెళ్లి మళ్లీ భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల నుంచి ఏటూరునాగారం, మేడారం, ములుగు, వరంగల్ తదితర ప్రదేశాల్లో మొక్కలతో ప్రయోజనాలు వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు చెప్పారు.

## ఐటీడీఏ ఏపీవోగా వసంతరావు

ఏటూరునాగారం, జూన్ 12 : ఏటూరునాగారం ఐటీడీఏ ఏపీవోగా వసంతరావు విధుల్లో చేరారు. ఉట్నూరు ఏపీవోగా పనిచేస్తున్న వసంతరావును ఇక్కడ నియమించారు. ఇక్కడ గత ఐదు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో వసంతరావును ఇక్కడ నియమించారు. గతంలో ఆయన ఇక్కడ ఏపీవోగా పనిచేశారు. గిరిజన సంక్షేమశాఖ విభాగం నుంచి ఉత్తర్వులు రావడంతో విధుల్లో చేరినట్లు వసంతరావు తెలిపారు.

# 'పెసా' చట్టం అమలుపై డాక్యుమెంటరీ చిత్రీకరణ



లఘు చిత్రాన్ని చిత్రీకరిస్తున్న బృందం

మంగపేట, జూన్ 12 : మండలంలోని వాడగూడెం లో పెసా చట్టం అమలు తీరుపై ఎంవోపీఆర్‌డీ (భారత ప్రభుత్వ మినిస్టరీ ఆఫ్ పంచాయతీరాజ్) విభాగానికి చెందిన బృందం సభ్యులు రాంబాబు గుప్తా, సమీ అశ్రర్ మిశ్రాలు పరిశీలించారు. చట్టం అమలు తీరుపై గ్రామం లో లఘు చిత్రాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా పెసా కమిటీ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. సొసైటీల ద్వారా ఇసుక అమ్మకాలను అడిగి తెలుసుకున్నారు. మినరల్ మైన్స్ గ్రామ సభను ఈ సందర్భంగా నిర్వహించారు. ఇసుక ఆదాయం క్యూబిక్ మీటర్‌కు రూ.40చొప్పున లక్ష క్యూబిక్ మీటర్లకు రూ.40లక్షలు ఎలా అందుతున్నాయనే విషయంపై చిత్రీకరించారు. అనంతరం మల్లూరులోని లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఎస్డీసీ అనీల్, పెసా జిల్లా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, టీజీ ఎండీసీ పీవో మేకల కిరణ్, పెసా మొబిలైజర్ల సంఘం అధ్యక్షుడు డబ్బుల ముత్యారావు, పూసం కార్తీక్, మడి శోభన్‌బాబు, తాటి విజయ్‌బాబు, పాయం రమేశ్, పూనెం రఘురాం, పున్నం శ్రావణ్, యాలం శ్రీను, 25గ్రామ పంచాయతీల మొబిలైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### రామప్పను సందర్శించిన
## సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి



శిల్ప కళా సంపదను వివరిస్తున్న ఆలయ గైడు విజయ్

వెంకటాపూర్, జూన్ 12 : రామప్ప దేవాలయాన్ని గురువారం సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి, కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తు కమిషన్ చైర్మన్ పీసీ గోష్ సందర్శించారు. న్యాయమూర్తి దంపతులను ఆలయ అర్చకులు హరీశ్‌వర్మ, ఉమాశంకర్, అధికారులు పూర్ణకుంభంతో స్వాగ తం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో బిళ్ల శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్ శిల్ప కళ సంపదను వారికి వివరించారు. అనంతరం వా రు రామప్ప సరస్సును సందర్శించారు. వారి వెంట ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు జగదీశ్, నారాయణ, డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ జయంతి, తహసీల్దార్ గిరిబాబు, ఆర్ఐ విజేందర్, సీఐ సురేశ్, ఎస్సై సతీశ్, పో లీస్, కోర్టు, రెవెన్యూ, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

### గూగుల్ వికిపీడియాలో
## సూక్ష్మ కళాకారుడి సమాచారం

కాటారం, జూన్ 12 : ప్రతిభతో పాటు కోట్లాది మంది ఆకాంక్షలు, ఆధ్యాత్మికతను చాటడానికి ఏ వస్తువైనా అనర్హం కాదన్నట్లు ఈ గురుకుల ఉపాధ్యాయుడు తన చిత్ర కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి గూగుల్ వికీపీడియా సమాచారంలో నిలిచాడు. కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయానికి చెందిన ఆర్ట్ టీచర్, మైక్రో ఆర్టిస్ట్ ఆడెపు రజనీకాంత్ సుమారు 1000కి పైగా సూక్ష్మ కళాఖండాలను బియ్యం గింజలు, చాక్ పీస్‌లు, పెన్సిల్ గ్రాఫైట్ మొనలపై విభిన్న ఆకృతుల్లో చెక్కి జాతీయంగా పలువురి ప్రశంసలు అందుకున్నాడు. పెన్సిల్ మొనపై గణపతి విగ్రహాన్ని, చాక్ పీస్‌లపై 78 జాతీయ జెండాలు, 108 శివలింగాలను చెక్కినందుకు గాను గూగుల్ వికీపీడియాలో సమాచారం పొందుపర్చినట్లు వికీపీడియా సమాచార సేకరణ కర్త మోతీరాం, రజనీకాంత్ తెలిపారు.

## ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

రేగొండ, జూన్ 12 : గ్రామీణ ప్రాంత్ర కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని డీఆర్‌డీవో బాలకృష్ణ అన్నారు. రేగొండలో ఉపాధి పనులపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కూలీలందరికీ 100 రోజులు పని కల్పిచాలన్నారు. వర్షాకాలంలో గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆధ్వర్యంలో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. టార్గెట్ ప్రకారం ప్లాంటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. కూలీలకు కనీసం రోజు రూ.300 కూలీ పడేలా ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో రాంప్రసాద్ ఉన్నారు.

## వానలు కురవాలని గ్రామదేవతకు జలాభిషేకం

మొగుళ్లపల్లి, జూన్ 12 : వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని మహిళలు గ్రామ దేవత పోచమ్మ తల్లి విగ్రహానికి సామూహిక జలాభిషేకం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనా వర్షాలు సరిగా కురువకపోవడంతో పత్తి విత్తనాలు నాటేందుకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గ్రామ దేవతకు జలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు.

## పంటలు పరిశీలించిన సంజీవరావు

ములుగురూరల్, జూన్ 12 : ములుగు మండలంలోని జాకారం, అబ్బాపురం గ్రామాల్లో సాగు అవుతున్న 2వ సంవత్సరం అరటి, బొప్పాయి, కూరగాయల తోటలను గురువారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డీ సంజీవరావు సందర్శించారు. ఈ మేరకు ఆయన రైతులకు పంటలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో 647 ఎకరాల్లో పండ్ల తోటలు, 207 ఎకరాల్లో కూరగాయలు రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. రాయితీపై తమ శాఖ ద్వారా మొక్కలు అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వినతి

వాజేడు, జూన్ 12 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకుడు కాకర్లపూడి విక్రాంత్ ఉన్నారు.

## ములుగు జిల్లాలో ఎస్సైల బదిలీలు

వాజేడు/ ఏటూరునాగారం, జూన్,12 : ములుగు జిల్లాలోని పలు మండలాల్లో గురువారం ఎస్సైల బదిలీలు అయ్యాయి. వాజేడు రాజ్ కుమార్ ఏటూర్‌నాగారం పోలీసుస్టేషన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీశ్ బదిలీపై వచ్చారు. ఏటూర్‌నాగారం ఎస్సై తాజుద్దీన్‌ను భూపాలపల్లి ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ములుగు ఎస్పీ ఆఫీసులో అటాచ్‌గా ఉన్న చల్ల రాజును వెంకటాపూర్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఘనంగా డాక్టర్ సీ నారాయణరెడ్డి వర్ధంతి

వాజేడు, జూన్ 12 : తెలంగాణ తెలుగు సాహిత్యానికి తొలి తెలుగు జ్ఞానపీఠాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ సీ నారాయణరెడ్డి అని తెలుగు ఉపన్యాసకులు, కవి, రచయిత డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు అన్నారు. మండలకేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం డాక్టర్ సీ నారాయణరెడ్డి 8వ వర్ధంతి వేడుకల్లో భాగంగా సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు శీనయ్య, అవంతి, నరసింగరావు, కాంతారావు, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగు భూములకు హక్కు కల్పించాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 12 : ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు కల్పించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అన్నారు. గురువారం కొమురంభీం కాలనీలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాడగూడెంలో ఆదివాసీలు సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని అన్నారు.

## పిడుగు పాటుకు గేదె మృతి

మొగుళ్లపల్లి, జూన్ 12 : మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన రైతు డ్యాగ రమేశ్‌కు చెందిన పాడి గేదె గురువారం పిడుగు పాటుతో మృతి చెందింది. గ్రామ శివారులో గడ్డి మేస్తుండగా బర్రెపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

మంగపేట, జూన్ 12 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రంలోని పొద్మూరుకు చెందిన బద్ది పాపారావు (33) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై టీవీఆర్ సూరి కథనం ప్రకారం.. పాపారావు ఈనెల 10న ఏటూరునాగారం మండలం రాంనగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చెప్పారు.

## మనస్తాపంతో గోదావరిలో దూకి ఆత్మహత్య

మహదేవపూర్ (కాళేశ్వరం), జూన్ 12 : మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి కాళేశ్వరం గోదావరి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తమాషారెడ్డి కథనం ప్రకారం.. భూపాలపల్లి పట్టణం ఖాసీంపల్లికి చెందిన నల్లపురి రమేశ్ (58) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చి కనిపించకుండా పోయాడు. కొంత కాలంగా కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన రమేశ్ కాళేశ్వరానికి వచ్చి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.